సాక్షి
మంచిర్యాల
శుక్రవారం, 16, ఆగస్టు, 2024

13,155 మందికి రుణమాఫీ



మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ పథకంలో భాగంగా గురువారం మూడవ విడత రూ.2లక్షలు రుణం పొందిన 13,155 మందిని అర్హులుగా ప్రకటించింది. జిల్లాలో మొదటి రూ.లక్షలోపు ఉన్న 28,749 మంది రైతులకు గాను రూ.151,27,19,035, రెండో విడతలో రూ.1.50లక్షలు మాఫీ 14,104 మంది రైతులకు గాను రూ.138,46,56,254, చివరి విడతలో రూ.2లక్షలు మాఫీ 13,155 మంది రైతులకు గాను రూ.175,43,83,912 విడుదల కానుంది. మొత్తం జిల్లాలో ఇప్పటివరకు 56,068 మంది రైతులను అర్హులుగా ప్రకటించి రూ.465,17,59,101 నగదు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

వాతావరణం

అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. తూర్పు దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

అభివృద్ధిలో అగ్రగామి..



ప్రసంగిస్తున్న ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్‌రావు

- ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల్లో ఆనందం
- అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు
- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న హర్కర వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యేలు వినోద్, ప్రేంసాగర్‌రావు, అధికారులు



నృత్యం చేస్తున్న నందిని డ్యాన్స్ అకాడమీ బృందం

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల భాగస్వామ్యంతోనే జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతం అవుతున్నాయని, అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని జిల్లా సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ప్రసంగించారు. ఆయన మాటల్లోనే.. అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనే లక్ష్యంతో ఇచ్చిన హామీలు నెరవేర్చే కార్యాచరణలో భాగంగా ఆరు గ్యారంటీల్లోని మహాలక్ష్మి పథకంలో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంలో జిల్లాలో ఇప్పటివరకు 86.32లక్షల మంది మహిళలు లబ్ధిపొందారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.500కే రాయితీ సిలిండర్ అందిస్తున్నాం. మహిళలకు ప్రతీ నెల రూ.2,500 అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ప్రజాపాలన

గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వరకు చేపట్టిన ప్రజాపాలనలో 2,58,213 దరఖాస్తులు స్వీకరించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నాం.

గృహజ్యోతి

గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారుల ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించడంలో భాగంగా మార్చి నుంచి జూలై వరకు రూ.19.17కోట్ల రాయితీ ఇచ్చాం.

విద్యారంగం

విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని 478 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ, మరమ్మతులు చేపట్టి సకల సౌకర్యాల నడుమ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నాం.

ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులకు రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు త్వరలోనే కార్యాచరణ విడుదలకు ప్రభుత్వం నిర్ణయించింది. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు రూపొందించిన మహిళా శక్తి పథకంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంల తయారీకి అవకాశం కల్పించాం. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, మీ సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంటు, క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంటు కేంద్రాలు, పాడి పశువులు, చేపలు, కోళ్ల పెంపకం, మిల్క్ పార్లర్ ఇతరత్రా యూనిట్ల మంజూరుకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత గల యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించేందుకు సిద్ధం ఉన్నాం.

వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాం. జిల్లాలో 80,193 మంది రైతులను రైతు బీమా ప్రయోజనం కింద చేర్చాం. రైతు రుణమాఫీ పథకం మొదటి విడతలో 28,392 మంది రైతులకు రూ.150 కోట్లు, రెండో విడతలో 14,365మంది రైతులకు రూ.139 కోట్లు రుణమాఫీ చేశాం.

ఉద్యానవన శాఖ

2024–25 సంవత్సరానికి గాను 1,800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు పెంపకం లక్ష్యంగా నిర్ధారించి ఇప్పటివరకు 475 ఎకరాలకు పరిపాలన అనుమతులు పొందాం. సూక్ష్మనీటి సేద్య పథకం కింద ఆయిల్‌పామ్ తోటల సాగుకు 900 డ్రిప్ లక్ష్యం కాగా 113 ఎకరాలకు పరిపాలన అనుమతులు పొందాం. వెదురు పథకం కింద 25ఎకరాల్లో బ్లాక్, 5,300 మొక్కలు బౌండరీ తోటల పెంపకం కోసం లక్ష్యం కాగా 17 ఎకరాల్లో బ్లాక్, 2,600 బౌండరీ తోటల పెంపకం ప్రగతిలో ఉంది.

నీటిపారుదల శాఖ

మంచిర్యాల నియోజకవర్గంలో కడెం ఆయకట్టు, గూడెం ఎత్తిపోతల పథకాల ద్వారా, చెరువుల ద్వారా సాగునీరు అందిస్తున్నాం. వరద ప్రభావిత ప్రాంతాల సంరక్షణ దిశగా మంచిర్యాలలోని రాళ్ల వాగుపై రూ.275 కోట్ల అంచనా వ్యయంతో కరకట్ట నిర్మాణానికి ప్రతిపాదించగా 2024–25 బడ్జెట్‌లో రూ.100 కోట్లు మంజూరు చేశాం.

గ్రామీణాభివృద్ధి

మహిళలు వారి కుటుంబంలో సుస్థిరమైన ఆదాయ అభివృద్ధి సాధించడం కోసం జిల్లాలో 10,170 స్వయం సహాయక సంఘాల్లో 1.15లక్షల సభ్యులు ఉన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 7,982 సంఘాలకు రూ.430 కోట్లు లక్ష్యం కాగా ఆగస్టు 9వరకు 1,211 సంఘాలకు రూ.110 కోట్లు రుణాలు మంజూరు చేశాం. స్త్రీనిధి పథకం కింద రూ.42కోట్లు లక్ష్యం కాగా రూ.7కోట్ల రూపాయల ప్రగతి సాధించాం.

పురపాలక సంఘాలు

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో రూ.కోట్లతో పెద్దయెత్తున అభివృద్ధి పనులు సాగుతున్నాయి. సమీకృత కూరగాయల మార్కెట్లు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, ప్లేగ్రౌండ్‌లు, పిల్లల పార్కులు, మురుగు కాలువలు, మహిళా భవనాలు, ఓపెన్‌జిమ్‌లు, అంతర్గత రోడ్లు, వీధి దీపాల ఏర్పాట్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్స్, పబ్లిక్ టాయిలెట్లు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం.

రహదారులు, భవనాలు

జిల్లాలో 685 కిలోమీటర్ల నిడివి గల రహదారులు విస్తరించి ఉన్నాయి. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో 165 పనుల ద్వారా రూ.1,355 కోట్లతో 512 కిలోమీటర్ల రహదారులు, 67 వంతెనలు, మూడు ఆర్‌ఓబీల నిర్మాణానికి మంజూరు చేయగా, 70 పూర్తి కాగా మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. చెన్నూర్‌లో కోర్టు భవనం, న్యాయమూర్తి నివాస భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.205 కోట్ల వ్యయంతో వైద్య కళాశాల భవన సముదాయాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో సింగరేణి కంపెనీ, రోడ్డు, రైలు, రవాణా వ్యవస్థ, జిల్లాలోని నీటి పారుదల వనరులు అభివృద్ధిలో ప్రత్యేక భూమిక పోషిస్తున్నాయి. ఎల్లంపల్లి జలాశయం, కవ్వాల్ అభయారణ్యం, గాంధారి ఖిల్లా, గాంధారి వనం ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలపై చేసిన నృత్యాలు అలరించాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, రోడ్డు రవాణా, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖల శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ శాఖల స్టాల్స్‌ను ప్రభుత్వ సలహాదారులు పరిశీలించి అభినందించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేసిన ఆర్‌వోఆర్ కొత్త చట్టం స్టాల్, ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ఇన్నోవేటర్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

పరిశ్రమల శాఖ

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా టీజీ ఐ–పాస్ ద్వారా 2024–25 సంవత్సరానికి గాను ఏడు పరిశ్రమలు రూ.3కోట్ల పెట్టుబడితో స్థాపించడం ద్వారా 77మందికి ఉపాధి కల్పించనున్నాం. టీ–ఐడియా, టీ–ప్రైడ్ పథకాల ద్వారా 32 దరఖాస్తులకు రూ.96లక్షలు రాయితీ మంజూరు చేశాం.



జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థుల నృత్యం



మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



మైనార్టీ గురుకుల విద్యార్థుల నృత్యం



పోలీసుల గౌరవ వందనం సమర్పణ



వేదికపై వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యేలు, డీసీపీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న వేణుగోపాల్‌రావు



గ్రామీణాభివృద్ధి శాఖ శకటం



విద్యుత్ శాఖ శకటం



ఇన్నోవేటర్ పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు



జాతీయ జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్



బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు



డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



జిల్లా కోర్టులో జిల్లా జడ్జి శ్రీనివాసులు



నస్పూర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

ఐపీఎస్ కేడర్‌లోకి డీసీపీ భాస్కర్



డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఐపీఎస్ కేడర్‌లోకి మారారు. 2019వ బ్యాచ్ గ్రూప్–1 అధికారిగా పోలీసు శాఖలో చేరిన ఆయన స్టేట్ సర్వీస్ పూర్తి చేసుకున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఐపీఎస్ హోదాను కల్పిస్తూ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. ఐపీఎస్ హోదాలోనే మంచిర్యాల డీసీపీగా విధులు నిర్వర్తించేందుకు యూపీఎస్సీ అవకాశం కల్పించింది. భాస్కర్‌కు ఐపీఎస్ కన్ఫర్మ్ కావడంతో జిల్లా పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

లక్కీడ్రా పద్ధతిన దుకాణాల కేటాయింపు



పేర్లు ప్రకటిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొత్తగా నిర్మించిన సమీకృత మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులకు గురువారం స్టాల్స్ కేటాయించారు. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో కూరగాయల వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పర్యవేక్షణలో లక్కీ డ్రా ద్వారా దుకాణాలు కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 108 స్టాల్స్ ఉండగా వీటిలో 54మంది కూరగాయల వ్యాపారులను గుర్తించి సీనియారిటీ ప్రాతిపదికన రిజర్వు చేశారు. మిగతా 54 దుకాణాలకు వ్యాపారుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. కొందరు కూరగాయల అమ్మకందారులు ఎన్నో ఏళ్ల నుంచి కూరగాయలు అమ్ముతున్న తమకు స్టాల్స్ ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందిస్తూ సీనియారిటీ ప్రకారం లబ్ధిదారుల జాబితా తయారు చేసి దుకాణాలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రూ.7.58కోట్ల అంచనా వ్యయంతో మార్కెట్ సముదాయం నిర్మిస్తున్నారని, కూరగాయల వ్యాపారుల కోసం 108 దుకాణాలు, 27షెట్టర్లు నిర్మించినట్లు తెలిపారు. మొదటి అంతస్తులో 108 స్టాల్స్, మరో 27 షెట్టర్లు నిర్మించి చికెన్, మటన్, చేపల అమ్మకందారులకు అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, కమిషనర్ కే.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కూరగాయల వ్యాపారులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో ఘనంగా వేడుకలు

జైపూర్: మండలంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లో ఈడీ రాజశేఖర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. ఎస్టీపీపీలో ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రిరూరల్: మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం ఉదయం 10గంటల నుంచి 6గంటల వరకు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి అందుబాటులో ఉంటారని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గీత కార్మికులకు భద్రత పరికరాల పంపిణీ



వేంపల్లిలో శిక్షణ పొందుతున్న గీత కార్మికుడు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో గురువారం మంచిర్యాల అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కాటమయ్యా సురక్షా కార్యక్రమంలో భాగంగా కల్లుగీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. కుల వృత్తిలో భాగంగా ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్యా సురక్షా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా ఎక్సైజ్ అధికారి కేజీ.నందగోపాల్ తెలిపారు. భద్రత పరికరాలతో కూడిన కిట్లను అందజేశారు. మంచిర్యాల అబ్కారీ సీఐ గురువయ్య, బెల్లంపల్లి సీఐ ఇంద్రప్రసాద్, చెన్నూర్ సీఐ హరి, లక్సెట్టిపేట అబ్కారీ సీఐ నర్సింహులు, గౌడ సభ్యులు, అబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి పోషమ్మ(68) బుధవారం రాత్రి హాజీపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి అల్లుడు మల్యాల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూటర్ దొంగిలించిన నిందితుడి రిమాండ్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రాకాలనీ వద్ద ఈ నెల 8న జియో సెల్ టవర్ రూటర్ దొంగిలించిన నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేందర్ తెలిపారు. బిహార్‌కు చెందిన హేశామొద్దీన్ ఉపాధి నిమిత్తం పట్టణానికి వచ్చి సెల్ టవర్‌లో ప్రైవేటు టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సెల్ టవర్‌ల రూటర్‌లను దొంగిలించి విక్రయిస్తుండేవాడు. టవర్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హేశామొద్దీన్‌పై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

యాభై అడుగుల ఎత్తులో జెండా ఆవిష్కరణ


ఎగురుతున్న జాతీయ జెండా

బెల్లంపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం బెల్లంపల్లి పాత బస్టాండ్ చౌరస్తా వద్ద 50 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన జాతీయ జెండాను మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత ఎగుర వేశారు. ప్రజల్లో జాతీయ భావాన్ని కలిగించాలనే ఉద్దేశంతో పట్టణ నడిబొడ్డున జెండాను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవాసమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు నాతరి స్వామి, బీజేపీ నాయకుడు రాజులాల్ యాదవ్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వద్ద ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు రెండు బైక్‌లను ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన యువతి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. స్థానిక సాయికుంటకు చెందిన రేగుంట రమేశ్, అతని కూతురు దీప (24), భూపాలపల్లి జిల్లా బండ్లపల్లి గ్రామానికి చెందిన బండి మహేష్, శ్రీరాంపూర్ ఆర్కే6 కాలనీ కొత్తరోడ్‌కు చెందిన బీ. నవీన్ ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రమేశ్, దీపకు తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తండ్రీ కూతుళ్లకు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ దీప గురువారం మృతి చెందింది. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన దీప జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం కోసం వెళ్తుండగా ప్రమాదానికి గురైంది.

అనాథ శవానికి అంత్యక్రియలు

పాతమంచిర్యాల: జిల్లా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గురువారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన కైలాస్ గత కొన్నేళ్లుగా మంచిర్యాల పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగించే వాడు. బుధవారం అనారోగ్యంతో ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందగా.. కుటుంబసభ్యులు, బంధువుల జాడ తెలియలేదు. అనాథ శవంగా అధికారులు నిర్ధయించారు. దీంతో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి, ప్రధాన కార్యదర్శి అటుకపురం రాయలింగు, మున్నాభాయి, చాపిడి సందీప్‌లు శవానికి పోస్టుమార్టం చేయించి వారి స్వంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్తములు వీరే..



హర్కర వేణుగోపాల్‌రావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

మంచిర్యాలఅగ్రికల్చర్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్‌రావు ఉత్తమ అవార్డులు అందజేశారు. గురువారం మంచిర్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ వివిధ శాఖలకు చెందిన 152మందికి, ఇంటింటా ఇన్నోవేటర్ విద్యార్థులకు మొత్తం 157 పురస్కారాలు అందజేశారు.


గణపతి, జెడ్పీ సీఈవో | హరిశ్చంద్రరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ | పురుషోత్తం నాయక్, ప్రాజెక్ట్ ఆఫీసర్ | మారుతీ ప్రసాద్, కమిషనర్, మంచిర్యాల


అనిత, జిల్లా వైద్యారోగ్య ప్రోగ్రాం అధికారి | సురేంద్ర, ఏఆర్ ఏసీపీ | సుధాకర్, సీఐ చెన్నూర్ | పి.శంకర్, టెక్నికల్ అసిస్టెంట్


ఎండీ సలీం, ఏఎస్సై | సత్యనారాయణ, కానిస్టేబుల్ | భూమన్న, ఆర్ఐ | ఉమశ్రీ, వైద్యాధికారి | హఫీజొద్దీన్, ఎఫ్ఆర్‌వో, జన్నారం | రాజమనోహర్‌రెడ్డి, తహసీల్దార్, జన్నారం | రాజవర్ధన్, ఎస్సై | వేణు, డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ | విజయలక్ష్మి, ఏపీఎం | అజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్


ఎం.కార్తీక్, టైపిస్ట్ | శాంకారి, డీఆర్‌పీ | జీ.సంధ్య, ఇన్‌స్ట్రక్టర్ | ఎం.కిషన్, ఆడిటర్ | శ్రీనివాస్, ఎంపీఎస్‌వో | నాందేవ్, ఎస్‌యూవో | రజిత, ఓపీ ఏఎన్ఎం | స్వరూప, ఎఫ్ఎస్‌వో | మల్లయ్య, ఏవో


శ్రీనివాస్, ఎంపీవో | అభిషేక్, సీనియర్ అసిస్టెంట్ | ఎస్.ప్రజ్ఞ, జూనియర్ అసిస్టెంట్ | శ్రీనివాస్, ఎంపీవో | రామ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ | పావని, సర్జన్, వెటర్నరీ | రమాదేవి, పంచాయతీ సెక్రెటరీ | రాము, కానిస్టేబుల్ | కొండ్రు ప్రశాంత్, పంచాయతీ సెక్రెటరీ


సరిత, ఆర్ఎస్సై | చిట్టిబాబు, హెడ్‌కానిస్టేబుల్ | శ్రీనివాస్, హోంగార్డు | చందన్‌కుమార్, పశు వైద్యాధికారి | గంగారాం, సూపరింటెండెంట్ | గంగమల్లు, వెటర్నరీ అసిస్టెంట్ | రాజగోపాల్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ | రవీందర్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ | రవితేజ, జూనియర్ అసిస్టెంట్ (డీపీఆర్‌వో)


షాబాజ్ ఖాన్, ఆఫీస్ సబార్డినేట్ (డీపీఆర్‌వో) | ప్రసాద్, ఎంపీడీవో, దండేపల్లి | గణేశ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ | సంజీవ్‌స్వామి, సూపరింటెండెంట్, భీమారం | మల్లికార్జున్, సీనియర్ అసిస్టెంట్ | లలిత, జూనియర్ అసిస్టెంట్, జెడ్పీపీపీ | మోయిజొద్దీన్, టైపిస్ట్ | రఘునందన్, ఇన్నోవేటర్ విద్యార్థి | స్ఫూర్తి, ఇన్నోవేటర్ విద్యార్థిని

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ దేశ పారిశ్రామిక అభివృద్ధిలో సింగరేణి ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి దేశ పారిశ్రామిక అవసరాలను తీరుస్తుందన్నారు. ప్రతీ ఉద్యోగి రక్షణతో పనిచేసి సంస్థను మరింత ముందుకు నడిపించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఇందారం ఓసీపీ అధికారి ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, శ్రీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకంతో అభివృద్ధి


ప్రారంభిస్తున్న హర్కర వేణుగోపాల్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంతో ఆర్థిక అభివృద్ధి దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని స్నేహలత గ్రామైక్య సంఘం –హాజీపూర్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రూ.6 లక్షల రుణ సదుపాయంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ భాస్కర్, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావులతో కలిసి ప్రారంభించారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి


సర్టిఫికెట్ అందజేస్తున్న అదనపు కలెక్టర్

తాండూర్: అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం మండలంలోని సురభి గోదా క్షేత్ర ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. 201 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ప్రభాకర్, సీఐ కుమారస్వామి, సురభి శరత్ పాల్గొన్నారు.

పంటచేలోనే ప్రాణాలొదిలాడు

- పిడుగుపాటుతో వలసకూలీ మృతి
- న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఆందోళన


పత్తి చేనులో హన్మంతు మృతదేహం

తాండూర్: బతుకుదెరువుకోసం వలస వచ్చిన వ్యవసాయ కూలీ పిడుగుపాటుతో మృతి చెందిన విషాద సంఘటన గురువారం మండలంలోని అచ్చులాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన ఇట్యాల హన్మంతు (34) కొంతకాలం క్రితం భార్య, నలుగురు పిల్లలతో కలిసి మంచిర్యాల జిల్లా భీమిని మండలం రాంపూర్ గ్రామానికి వలస వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం అచ్చులాపూర్‌కు చెందిన పొట్లపల్లి రాజిరెడ్డి అనే రైతు పత్తి చేనులో క్రిమిసంహారక మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. మందు పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడడంతో హన్మంతు అక్కడికక్కడే మృతి చెందగా రాజిరెడ్డి భార్య మల్లక్క స్పృహ కోల్పోయింది. విషయం తెలుసుకున్న రాజిరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని మల్లక్కను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. భర్త మరణ వార్త తెలుసుకున్న హన్మంతు భార్య, పిల్లలు మాకెవరు దిక్కని మృతదేహంపై పడి బోరున విలపించారు. తమకు పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా కారుచీకట్లో మృతదేహంతో రోదించడం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. మృతునికి భార్య సుజాత, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై డి.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా హన్మంతు మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

హత్య కేసులో ముగ్గురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గురునానక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఈ నెల 13న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సబ్బెపల్లికి చెందిన బియ్యం వ్యాపారి దేవయ్య (37) అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం సదరు మహిళ భర్తకు తెలియడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. తమ తమ్ముడి చావుకు కారణమైన దేవయ్యను హతమార్చాలని కోట సత్తయ్య, కోట అంజన్న, కోట సాయిలు నిర్ణయించుకున్నారు. ముగ్గురూ కలిసి ఈ నెల 13న దేవయ్య కనిపించడంతో మాయమాటలు చెప్పి అతనితో కలిసి రాత్రి వరకు మద్యం సేవించారు. ఆతర్వాత ఇనుప పైపుతో దేవయ్య తలపై బలంగా కొట్టి హత్య చేశారు. దేవయ్య భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ నరేందర్, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య


తొగరి శ్రీధర్(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం మత్తులో ఒకరు, భార్య వదిలి వెళ్లిందని మరొకరు, అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి రాలేదని ఇంకొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అశోక్‌రోడ్డుకు చెందిన లెక్కల మహేష్(60) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ కొద్ది రోజులుగా పని చేయకుండా జులాయిగా తిరుగుతుండే వాడు. మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జాఫర్‌నగర్‌లో..

జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌కు చెందిన శుభం మండల్(26) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శుభం మండల్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో భార్య అంజూమ్ మండల్ పది రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శుభం మండల్ గురువారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హమాలీవాడలో..

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తొగరి శ్రీధర్(36) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ తన స్నేహితుల్లో కొందరికి సుమారు రూ.40లక్షల వరకు అప్పుగా ఇచ్చాడు. స్నేహితులు తిరిగి ఇవ్వకపోవడం, ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపం చెంది ఈ నెల 12న మద్యంమత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాములు తెలిపారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

పాతమంచిర్యాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో జిల్లా స్థాయి వీవోఏల సమావేశం నిర్వహించారు. వీవోఏల సంఘం అధ్యక్షుడు కుంటాల కుమార్, నాయకులు భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, లావణ్య, అనూష, మహేష్, సమ్మన్న, శంకర్, లక్ష్మణ్‌దాస్, వెంకటి, వెంకటస్వామి, పోషన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల మహేష్ పాల్గొన్నారు.